
ప్రజాశక్తి
గురువారం 19 డిసెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



23న చలో ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టరేట్

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై సుదూర ప్రాంతాల గురుకులాల్లో నియమించడానికి నిరసనగా ఈ నెల 23న చలో గిరిజన సంక్షేమ డైరెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమించడం గతంలో ఎన్నడూ జరగలేదని తెలిపారు. ఈ విధానం వల్ల అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే డెప్యుటేషన్ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



పాచిపెంట మండలంలో కోసిన వరిచేనును పొలాల్లో కుప్పలు వేస్తున్న రైతులు

అన్నదాతల్లో గుబులు

ప్రజాశక్తి-వీరఘట్టం

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణంలో ఒక్కసారి మార్పు రావడంతో అన్నదాతల్లో గుబులు రేపింది. ఎన్నో అష్టకష్టాలు పడి సాగు చేసి, కొద్దిరోజుల్లో పంట చేతికొస్తుందన్న తరుణంలో వాతావరణ మార్పులు రైతుల కంటిమీద కునుకు పడనీయడం లేదు. కొన్నిచోట్ల కోసిన వరిచేనంతా కళ్లాల్లో, పొలాల్లో ఉంది. పంటలను కాపాడుకునేందుకు కోసిన వరిచేను కుప్పలు వేసి, టార్పాలిన్లు కప్పారు. నూర్పిడి పూర్తయిన చోట ధాన్యాన్ని బస్తాల్లో నింపి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొన్నిచోట్ల కళ్లాల్లోనే బస్తాలపై టార్పాలిన్లు కప్పి భద్రపరిచారు.



వీరఘట్టం... వరిచేను కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

వరికోతలు వాయిదా వేసుకోవాలి

పాచిపెంట : రెండు రోజులపాటు వర్షం పడే అవకాశాలు ఉందని, రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని చెరుకుపల్లి, అమ్మవలస గ్రామాల్లో బుధవారం వరి నూర్పులను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు జారీ చేశారు. వరి కోతలు వాయిదా వేయాలని, కోత కోసినవి కుప్పలు వేసి కప్పుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఎక్కడైనా ధాన్యం నిల్వలు ఉంటే, వెంటనే ట్రక్ షీట్లు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు. మొక్కజొన్న పంటకు నీరు పోయేందుకు సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం టు సాలూరు మన్యం

- మారిన డిప్యూటీ సిఎం పవన్ టూర్
- 20న సిరివర రోడ్డుకు శంకుస్థాపన?
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి



సిరివర రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏజెన్సీ ప్రాంత పర్యటన షెడ్యూల్ మారింది. మొదట పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లను పరిశీలిస్తారని చెప్పారు. దీనికోసం గుమ్మలక్ష్మీపురంలో హెలిప్యాడ్ కూడా ఏర్పాటుచేశారు. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు రావడంతో పవన్ కళ్యాణ్ టూర్ రద్దయింది. ఇప్పుడు మళ్లీ పవన్ కళ్యాణ్ పర్యటన సాలూరు ఏజెన్సీ ప్రాంతం వైపు మళ్లినట్లు తెలుస్తోంది. సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామం సిరివర రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. అయితే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆయన విజయనగరం నుంచి రోడ్డు మార్గాన సాలూరు పట్టణానికి చేరుకుని అక్కడి నుంచి మామిడిపల్లి, శంబర, మక్కువ మీదుగా పనసబద్ర పంచాయతీ బాగుజోల చేరుకుంటారని సమాచారం. అక్కడ సిరివర రోడ్డుకు భూమిపూజ చేయనున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగానే బుధవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి.. సిరివర రోడ్డును పరిశీలించినట్లు బోగట్టా.

సిరివర రోడ్డు ప్రాధాన్యత ఏమిటి?

కొదమ పంచాయతీ పరిధిలోని సిరివర.. గిరిశిఖర గ్రామం. ఈ గ్రామానికి రోడ్డు నిర్మించాలని దశాబ్దాలుగా ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. ఈ రోడ్డు నిర్మిస్తే సుమారు పది గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కలగనుంది. బాగుజోల, చిలకమెండంగి, తాండిపుట్టి, సిరివర, పొయిమల, కొదమతోపాటు చుట్టుపక్కల పది గ్రామాలకు రవాణా సౌకర్యం కలగనుంది. గిరిశిఖర గ్రామాల నుంచి అత్యవసర పరిస్థితుల్లో డోలీమోతల్లో రోగులను తరలించే పరిస్థితి ఉండదు. ఈ రోడ్డు నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా, నిరసన దీక్షలు చేపట్టారు. గతంలో టిడిపి ప్రభుత్వం చరమాంకంలో సిరివర నుంచి గిరిజన గర్భిణిని డోలీమోత ద్వారా దుగ్గేరు తీసుకొస్తుండగా ఆమె మార్గం మధ్యలో ప్రసవించింది. ఆ సందర్భంలో బిడ్డ మరణించింది. తల్లిని క్షేమంగా పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనతో సిరివర పేరు రాష్ట్ర స్థాయిలో మోగింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ సంఘటనపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఐటిడిఎ పిఒకి నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాతనే అప్పటి ఐటిడిఎ పిఒ లక్ష్మీశా గిరిశిఖర గర్భిణుల కోసం వైటిసిలో వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

పనులు ప్రారంభించినా..

గత వైసిపి ప్రభుత్వ హయాంలోనూ సిరివర రోడ్డు నిర్మించాలని గిరిజన సంఘాలు ఆందోళన చేశాయి. అప్పటి డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర... రోడ్డు నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతుల మంజూరు కోసం కృషి చేశారు. పనులు ప్రారంభించినా, అప్పుడు కాంట్రాక్టరు తుప్పలు, డొంకలు తొలగించి, మట్టి పనులు చేసి వదిలేశారు. ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడం లేదనే సాకుతో అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఈ నెల 20న శంకుస్థాపన చేయనున్నారని సమాచారం. దీని కోసమే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారని తెలిసింది.

సఫాయి కర్మచారులకు పునరావాసం

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పి.పి.వావా



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పి.పి.వావా

ప్రజాశక్తి-పార్వతీపురం

సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు పునరావాసం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా స్పష్టంచేశారు. సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు వావా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకు రుణాలకు షూరిటీలు అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ల తదితర పెంపకం యూనిట్లు మంజూరు చేయవచ్చని, సేవా రంగంలోనూ అనేక అవకాశాలను కల్పించవచ్చని చెప్పారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమగు దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్, నూనె తదితర సామగ్రిని విధిగా అందజేయాలని ఆదేశించారు. హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయించాలని, నిర్దేశిత సమయంలో వైద్య శిబిరాలను నిర్వహించి పరీక్షలు చేయాలని సూచించారు. వారి ఆదాయాలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని చెప్పారు.


ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, వారి సమస్యలను తెలుసుకున్నారు. అంతకు ముందు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పి.పి. వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. జిల్లా పరిస్థితిని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, డిపిఒ టి.కొండలరావు, డిఇఒ తిరుపతి నాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, జిల్లా కార్మిక శాఖ అధికారి కె.రామకృష్ణారావు, డివిజనల్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరాజు, ఎస్.సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బడిదేవరకొండపై మైనింగ్ ఆపాలి

పరిరక్షణ కమిటీ పిలుపు • 28న కోరి గ్రామంలో విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

బడిదేవరకొండపై అక్రమంగా చేపడుతున్న మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండపై ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే పనులు చేపడుతున్నారని తెలిపారు. ఈ పనుల వల్ల కొండకు ఆనుకొని ఉన్న గిరిజనులకు, ప్రజలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా పార్వతీపురం మండలానికి తీవ్ర నష్టమని తెలిపారు. అక్రమ మైనింగ్ ఆపాలని నవంబర్ 6న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అనుమతులు లేవని పోలీసులు అడ్డుకోవడంతో కార్యక్రమం నిలిపేశామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

అనంతరం రైతులకు, ప్రజలకు ముమ్మరంగా కోతలు సీజన్ ఉండడంతో కమిటీ నిర్ణయం మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వివరించారు. వరి కోతలు పూర్తి కావడంతో కార్యక్రమం పునఃప్రారంభానికి కమిటీ నిర్ణయించడంతో ఈ నెల 28న కోరి గ్రామంలో చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాల ప్రజలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. అక్రమ మైనింగ్ పనులను అడ్డుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పాలక రంజిత్, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.నర్సింగరావు, సిపిఐ నాయకులు ఆర్.వి.ఎస్ కుమార్, చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు వి.దాలినాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు బి.శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, జనసేన నాయకులు జయకృష్ణ పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో పాఠాలు బోధిస్తున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు

శిబిరం వద్దే పాఠాలు

వినూత్నరీతిలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-సీతంపేట

గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు వినూత్నరీతిలో దీక్షా శిబిరం వద్ద విద్యార్థులకు పాఠాలు చెబుతూ నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐటిడిఎ గేటు వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరాయి. వివిధ రకాలుగా నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం సమ్మె శిబిరంలో విద్యార్థులకు పాఠాలు బోధించారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురం

పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 18 మంది ఎంపికయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 56 మంది హాజరయ్యారు. వీరిలో 18 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. జాబ్‌మేళాకు మెడ్‌ప్లస్ ఫార్మసీ, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, భారత్ పే కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

సిమెంట్ బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, మండ గ్రామ సచివాలయాల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినా నేటికీ సిమెంట్ బిల్లులు చెల్లించలేదని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో డ్వామా పీడీ రామచంద్రరావు గుమ్మలక్ష్మీపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా కాంట్రాక్టర్ల సమస్యలపై లేఖ అందించామని తెలిపారు. కాంట్రాక్టర్లు వారి భార్యాపిల్లలను పట్టుకొని తమ ఇళ్లకు వచ్చి బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి బిల్లులు చెల్లించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బీసు, హైమావతి, ఎంపిటిసి మాజీ సభ్యులు రాజేష్ పాల్గొన్నారు.

ఒకేచోట ఉంటారా.. స్థలాలిస్తాం

బాగుజోల గిరిజనులతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-మక్కువ

'కొండశిఖరంపై వేర్వేరు చోట్ల గిరిజనులు నివశించడం వల్ల ఇబ్బందులకు గురవుతూ రోగాల బారిన పడుతున్నారు. అంతా ఒకే చోట నివశించగలరా? ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు మంజూరు చేస్తా'మని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గిరిజనులకు సూచించారు. కలెక్టర్ సూచనలకు అక్కడ గిరిజనులు విముఖత వ్యక్తం చేశారు. పండించే పంటలు అడవి జంతువుల బారిన పడకుండా కాపాడుకునేందుకు వీలు కలుగుతుందని, అందుకే ఎన్ని కష్టాలైనా కొండలపైన నివాసం ఉండాల్సి వస్తోందని కలెక్టర్ వద్ద వాపోయారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని బాగుజోల గిరిజన గ్రామాన్ని కలెక్టర్, ఎస్‌పి మాధవరెడ్డి బుధవారం సాయంత్రం సందర్శించారు. సిరివర గ్రామానికి వెళ్లే రహదారిని పరిశీలించారు. అనంతరం బాగుజోల, సిరివర, చిలకమెండంగి తదితర గిరిజనులతో మమేకమయ్యారు. బాగుజోలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో అన్ని కుటుంబాలకు వెంటనే మరుగుదొడ్లు మంజూరు చేయాలని ఎంపిడిఒ స్వరూపరాణిని ఆదేశించారు. డిఆర్‌డిఎ పీడీ సత్యంనాయుడుతో మాట్లాడుతూ గిరిజనులకు అవసరమైన వన్‌ధన్ వికాస్ కేంద్రాలను, రాయితీపై గొర్రె పిల్లలకు రుణాలను అందించాలని ఆదేశించారు. చిలకమెండంగి, సిరివర గ్రామస్తులు రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సిగ్నల్స్ లేవని, పాఠశాల భవనం దెబ్బతిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామని కలెక్టర్ వారితో అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ హేమలత, ఫారెస్ట్ రేంజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.గోపాల్ రావు నాయుడు, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మమేకమైన కలెక్టర్, ఎస్‌పి

పిఎంఎవైకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం కింద అర్హత గల వారు దరఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గృహ నిర్మాణాలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగి గతంలో ఇల్లు మంజూరు కాని వారికి, మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. అర్హత గల వారు గ్రామ సచివాలయం వద్ద ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి భార్య, భర్తల సంతకం చేసిన ఆధార్ కార్డులు నకలు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజి జిరాక్స్ కాపీ, స్థలం అనుబంధ పత్రం లేదా స్థలం రిజిస్టర్ డాక్యుమెంట్, ఇసి, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, ప్రస్తుత ఇంటి స్థలం కెమెరా ఫొటో, తదితర డాక్యుమెంట్లు జత చేయాలని వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక ఇంజినీర్ వంశీ, డిఇ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు పట్టవా? : సిపిఎం

ప్రజాశక్తి-కొమరాడ

మన్యంలో విద్యార్థుల వరుస మరణాలు సంభవిస్తున్నా ప్రభుత్వానికి, అధికారులకు పట్టడం లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.సాంబమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వరుసగా విద్యార్థులు మరణించడానికి కారణం వైద్యం అందకా? లేక పోషకాహారం అందడం లేదా? అని ప్రశ్నించారు. ఏదేమైనా గిరిజన విద్యార్థులు మరణించడం చాలా బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి జిల్లాకు చెందిన వ్యక్తి అయినా, ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో ఎనిమిది మంది విద్యార్థులు మరణించడం విచారకరమన్నారు. మరోవైపు దాదాపు నెల రోజులుగా గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యారని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గిరిజన గురుకులాలకు డెప్యుటేషన్‌పై పంపించడం వల్ల రెండు చోట్లా గిరిజన విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. నిరసనలు, ప్రజాసంఘాలతో కలిసి ఉండటం వల్ల మీ సమస్యలు పరిష్కారం అవుతాయా? అంటూ మంత్రి ఎటకారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ప్రతిపక్షం ఉన్న సందర్భంలో ఏనుగులు, పార్వతీపురం- రాయగడ అంతర్రాష్ట్ర రహదారి, పూర్ణపాడు- లాబేసు వంతెన సమస్యలపై కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు మంత్రి రాలేదా? నిలదీశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శివ, సింగన్న పాల్గొన్నారు.


21న తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక

వీరఘట్టం : ఈ నెల 21న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఇరిగేషన్ ఎఇ డి.వెంకటరమణ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నోటిఫికేషన్‌ను ప్రచురించారు. డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వీరఘట్టం, తుడి, ఎం.సింగపురం, రావివలస, రాజుల గుమ్మడ డిస్ట్రిబ్యూటర్ కమిటీ సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

అంగన్వాడీ టీచర్ మృతి

ప్రజాశక్తి-మక్కువ

పనసభద్ర పంచాయతీ పరిధిలోని బందమెండంగి అంగన్వాడీ కార్యకర్త దిమ్మిడి పెంటమ్మ (52) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతిపై అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



పెంటమ్మ (ఫైల్)



చెక్కు అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గతేడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాలకొండ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.సత్యనారాయణ కుటుంబానికి పోలీస్ శాలరీ ప్యాకేజి (ఎస్‌బిఐ ప్రమాద మరణ ప్రయోజనాలు) ద్వారా మంజూరు చేసిన రూ.75 లక్ష చెక్కును బుధవారం ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాఖా పరంగా ఇంకా రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్‌రెడ్డి, ఎస్‌బి సిఐ రంగనాథం, ఆర్‌ఐలు నాయుడు, శ్రీరాములు, సూపరింటెండెంట్ సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి
ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మహిళలు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో హాజరై వినతులు సమర్పించారు. ప్రతీ ఒక్కరి సమస్య క్షుణ్ణంగా ఆలకించి, సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డిప్యూటీ డిఇఒ నారాయుడు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సవర గొయిది జిపిఎస్ పాఠశాలను బుధవారం డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు సందర్శించారు విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. తరగతికి తగిన విధంగా పిల్లల్లో విద్యా స్థాయిని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఒకటి, రెండు తరగతులకు అక్షరమాల చార్టులు గదిలో ప్రదర్శించాలని ఆదేశించారు. మూడు, నాలుగు, ఐదు తరగతులకు చతుర్విధ ప్రక్రియలపై ఎక్కువ సాధన చేయించాలన్నారు. విద్యార్థులకు దగ్గరుండి పాఠాలు బోధించారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. హాజరును పరిశీలించారు.

బూర్జ, పెదంకలాంలో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ, పెదంకలాం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహశీల్దార్ ఉమామహేశ్వరరావు పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ దామోదర్ నాయుడు, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు

విపత్తుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అకస్మాత్తుగా విపత్తులు సంభవించేటప్పుడు దానివల్ల జరిగే ప్రమాదాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డిఆర్‌ఎఫ్ టీం కమాండర్ ప్రభిన్ పుఖాన్ అన్నారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి గ్రామ సమీపంలోని కోనేరులో ఆయన ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, విపత్తుల నివారణ, నిర్వహణ, ఉరుములు, మెరుపులు, కుంభవృష్టి, వడగండ్ల వాన, బలమైన గాలులు వీచినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ టీం హెచ్‌సి ఎం.రామారావు, ఫైర్‌స్టేషన్ ఎస్‌ఐ బి.ప్రసాదరావు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-వీరఘట్టం

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అగ్నిమాపక శాఖ పాలకొండ ఎస్‌ఐ జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రమాదాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.స్వామిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెదబుడ్డిడిలో రామ్మోహన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడిలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. రామ్మోహన్ వీరాభిమాని కె.కుమార్ గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, ఎంపిపి బొంగు సురేష్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల రమాకాంత్, బొత్స రాగాల అప్పలకొండ, రేవల్ల సీతారాంనాయుడు, రేవల్ల రామమూర్తి నాయుడు, బలిమి వెంకటరమణ, వి.దామోదర్ నాయుడు, టి. శ్రీనివాసరావు, కర్రి చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న టిడిపి నేత దత్తి లక్ష్మణరావు

జిల్లాలో కాఫీ క్లస్టర్

శతాభి వద్ద ఏర్పాటుకు అవకాశాలు : కలెక్టర్


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పాచిపెంట మండలం శతాభి వద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రాథమిక రంగాల శాఖల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలం గట్లపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేయాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కూరగాయల విత్తనాలను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా చేపట్టాలని ఆదేశించారు. జనవరి నుంచి రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. డ్రోన్ వినియోగంలో ముందంజలో ఉండాలని చెప్పారు. మహిళలు డ్రోన్ పైలట్లుగా రావాలని తెలిపారు. ఉద్యానవన పంటల్లో 15 శాతం వృద్ధి ఉండాలని స్పష్టంచేశారు. ఆయిల్‌పాం వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిమ్మగడ్డి పెంపకం వల్ల రైతులకు ఆదాయం వస్తుందని వివరించారు. రైతులకు ఆయా క్షేత్రాలను చూపించాలని, ప్రతి నెలా నిమ్మగడ్డి పెంపకందారుల సంఖ్య పెంచాలని కోరారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు (పికెసిసి) రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మత్స్య ఉత్పాదక సంస్థ (ఎఫ్‌పిఒ) ద్వారా మత్స్య ఆహార యూనిట్ల ఏర్పాటుకు యోచించాలని చెప్పారు. నగర వనం, నగర వాటిక అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూనను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి జి.ఎ.పి.ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, పిహెచ్ఒ మణి భూషణ్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాక్రిష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ జెఎల్‌ఎన్ మూర్తి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం షణ్ముఖరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగానే అర్జీల పరిష్కారం

ప్రతి సోమవారం మండల స్థాయిలో పిజిఆర్‌ఎస్ : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్‌ఎస్) అందిన అర్జీలు స్థానికంగానే పరిష్కారం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు, గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో పిజిఆర్‌ఎస్ విధిగా నిర్వహించి, సమస్యలు అక్కడే పరిష్కారం కావాలని స్పష్టంచేశారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలను అశ్రద్ధ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా పంపిణీ కింద వస్తున్న సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లను తొలగించాలన్నారు. మండల స్థాయిలో జరిగే సదరం శిబిరాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, సంచుల కొరత లేకుండా చూడాలని చెప్పారు. గృహ నిర్మాణంలో పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జియ్యమ్మవలస మండలంలో పిఎం జన్‌మాన్ ప్రగతిలో వేగం లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. గృహ లేఅవుట్ల వద్ద అవసరం మేరకు బ్రిక్ యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని స్పష్టంచేశారు. ప్రతి నెల కనీసం 500 ఇళ్లు పూర్తి కావాలన్నారు. పిఎం జన్‌మాన్ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రెవిన్యూ సదస్సులలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా జారీ చేయవచ్చని తెలిపారు. అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వివరాలు తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, డిపిఒ టి.కొండలరావు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి.లక్ష్మణరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, ఆర్‌అండ్‌బి ఇంజనీరింగ్ అధికారి సుబ్బారావు, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారి మణిరాజ్, డిడిఎంహెచ్ఒ టి.జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు వినియోగంలోకి..

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న మరుగుదొడ్లను సంబంధిత అధికారులు బుధవారం వాడులోకి తెచ్చారు. మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ఇటీవల సిపిఎం పట్టణ నాయకులు కోరారు. ఈ నేపథ్యంలో మరుగుదొడ్లకు తాళాలు తీసి, వినియోగంలోకి తెచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు వాటిని పరిశీలించి, రైల్వే అధికారులకు అభినందనలు తెలియజేశారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి-కొమరాడ

అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి అన్నారు. బుధవారం మండలంలోని కోటిపాం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని 41 పంచాయతీల్లో నిర్వహించే పీసా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఎన్నికల సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఐటిడిఎలో సంబంధిత ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 31వ తేదీలోపు 102 గ్రామసభలు నిర్వహించి, ఎన్నికలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఎంపిడిఒ కె.గీతాంజలి, తహశీల్దార్ అప్పలరాజు పాల్గొన్నారు.

పీసా ఎన్నికల షెడ్యూల్‌ను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ నెల 20, 21, 23, 27, 28, 30 తేదీల్లో పీసా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

వినియోగదారుల వారోత్సవాల్లో కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వినియోగదారుల హక్కులు, చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక వైటిసిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. కొనుగోలు చేసే వస్తువులను వినియోగించే క్రమంలో ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయిస్తే ఆ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని తెలిపారు. మనం ఏవైనా వస్తువులు తీసుకున్నప్పుడు కచ్చితంగా వాటి కాలపరిమితి చూడాలని, బిల్లు పక్కాగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు పి.నాగమణి, ఎంఇఒ చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులతో మాట్లాడి, అందుతున్న వసతులపై ఆరాతీశారు. డార్మిటరీ, వంటగది పరిసరాలను పరిశీలించారు. గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైటిసి మేనేజర్ రాము పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

తాడికొండ పంచాయతీ కప్పకల్లు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు.. బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం లేదన్నారు. కొండపై నుంచి కిందకు రావాలంటే నానా కష్టాలు పడాల్సి వస్తుందని విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని..

కురుపాం : మండలంలో ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఆ గ్రామ నాయకులు ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతి పత్రం అందించారు. ఆశ్రమ పాఠశాల ఆవరణమంతా అటవీ ప్రాంతమని, ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు లోపలికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు నిద్రిస్తున్న సమయంలో ఏ క్షణాన ఏమి జరుగుతుందో తెలియదని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రహరీ మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



కొమరాడ.. మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లికార్జునరావు

ప్రజాశక్తి-కొమరాడ

ప్రతిఒక్కరూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ, వెలుగు కార్యాలయాలు, కొమరాడ గ్రామ సచివాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు డి.లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పనిచేస్తూ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం సురేష్ బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజేంద్ర, పిఆర్ జెఇ ఫనీస్‌బాబు, ఎఒ పి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి చేయాలి

వీరఘట్టం : ప్రణాళికల ఆధారంగా గ్రామాలు అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ... సర్పంచులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులతో నిర్వహిస్తున్న శిక్షణలో మాట్లాడారు. సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ డి.వెంకటరమణ, డిఆర్‌పిలు బంగారుబాబు, రాము, ఎపిఎం కె.రాము, ఎపిఒ జి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

కిశోర వికాసంతో సంపూర్ణ అభివృద్ధి

ప్రజాశక్తి-భామిని

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు, సంపూర్ణ అభివృద్ధికి కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్ రాణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ పిఒ శాంతి భవాని అధ్యక్షతన బుధవారం కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టిసారించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల వల్ల నష్టాలపై వివరించాలని చెప్పారు. బాలికల ఆత్మరక్షణపై, ప్రతీ గ్రామంలో బాలికల సంఘాలు ఏర్పాటుపై, ఆన్‌లైన్ వేదికలపై అవగాహన కల్పించాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, బాలికల సంపూర్ణ ఎదుగుదలని నిరోధించే అడ్డంకులను సమిష్టిగా తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి, ఎంపిడిఒ చంద్రరావు, ఎంఇఒ వి.భాస్కరరావు, ఐసిడిఎస్ సిబ్బంది శ్రీధర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. జిల్లా ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం ప్రకారం.. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన ఆమిటి సతీష్ 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సతీష్ మద్యానికి అలవాటు పడటంతో ఎప్పటికప్పుడు భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో ఆయన భార్య ఐదేళ్ల నుండి పిల్లలతో తన కన్నవారి ఇంటిలో ఉంటోంది. ఎన్నిసార్లు కబురు పంపినా, పెద్దలతో పిలిపించినా, నోటీసులు ఇచ్చినా ఆమె రాలేదు. దీంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటి మేడపైకి వెళ్లి పెట్రోల్ పోసి, నిప్పంటించుకొన్నాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సుమారు 80శాతం వరకు శరీరం కాలిపోయింది. వివరాలు నమోదు చేసినట్లు ఔట్ పోస్టు ఎఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విఆర్‌ఒ చంద్రమౌళి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో మొండెంఖల్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం...

తిత్తిరి పంచాయతీ విఆర్‌ఒ చంద్రమౌళి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఆ గ్రామంలో నెట్ సమస్య ఉండటంతో సదస్సులో వచ్చిన అర్జీలను అప్‌లోడ్ చేసేందుకు మొండెంఖల్ గ్రామానికి వచ్చారు. పని పూర్తయ్యాక స్వగ్రామం.. జియ్యమ్మవలస మండలంలోని పిటిమండకు బైక్‌పై బయల్దేరారు. నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడ గ్రామానికి చెందిన గణపతి.. గుమ్మలక్ష్మీపురం వెళ్తున్నారు. మొండెంఖల్ గ్రామ సమీపంలోని చెరువు వద ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - కురుపాం

మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని ఎస్‌ఐ పి.నారాయణరావు వాహనదారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎఎంసి యార్డు సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. బకాయిలు ఉన్న వాహనదారులకు వెంటనే పెనాల్టీతో వాటిని కట్టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపొద్దని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భద్ర, అశోక్ తదితరులు ఉన్నారు.